క్లుప్తంగా

'బైపాస్' నిర్మాణానికి భూముల పరిశీలన



పొలాల పరిశీలనకు బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూముల పరిశీలనకు ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డి మండలంలోని ఎస్.నాగలాపురం గ్రామంలో పర్యటించారు. గ్రామం నుంచి కొత్తగా వేయాలనుకున్న బైపాస్ రోడ్డు వరకు వాహనం వెళ్లకపోవటంతో తన వయస్సును లెక్క చేయకుండా బైక్‌పై వెళ్లి పొలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊర్లో రోడ్లు ఇరుకుగా ఉన్నందున బైపాస్ రోడ్డు వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కాగా సాయంత్రం రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

'వైఎస్సార్ కళ్యాణమస్తు' మంజూరు

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కళ్యాణానికి అందించే వైఎస్సార్ కళ్యాణమస్తు / షాదీ తోఫా పథకం మండలంలో 9 మందికి మంజూరైందని ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. బసినేపల్లి 1, హంప 1, మద్దికెర 5, పెరవలి గ్రామానికి చెందిన ఇద్దరి మంజూరైందని వివరించారు. అమ్మాయిల తల్లి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేస్తుందని చెప్పారు.

ప్రశాంత జీవనంతో మోక్షం




గురువులను సన్మానిస్తున్న దృశ్యం

మద్దికెర: పోటీ ప్రపంచంలో మానవులు ప్రశాంతత కరువై దుర్భర జీవితం గడుపుతున్నారని, తోటి వారికి సాయం చేస్తూ ప్రశాంత జీవనమే మోక్ష మార్గమని సద్గురు సూర్యానందస్వామి అన్నారు. శనివారం స్థానిక చిదానందాశ్రమంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పదో వార్షికోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములను సన్మానించారు. అనంతరం ప్రవచనాలు వినిపించారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐదువందలకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీటీ ఏరియా కో-ఆర్డినేటర్ హనుమంతప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలూరు ఆర్డీటీ పరిధిలోనున్న ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు సోమవారం 10వ తరగతి మార్కులిస్టు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో ఆలూరులోని ఆర్డీటీ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్డీటీ సెట్‌లో ఉత్తీర్ణులైన వారికి సంస్థ తరపున ఆరేళ్ల పాటు చదువులకయ్యే ఖర్చులను భరిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన నరసింహ జయంతి



ప్రత్యేక అలంకరణలో నరసింహ స్వామి

ఆలూరు: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రతిష్ఠించిన నరసింహ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రాణేచి ఆచార్ ఆధ్వర్యంలో ఆకుపూజ, గంగపూజ,హోమాలు, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బ్రాహ్మణులు తరలివచ్చారు. పండితులు నాగరాజ్ ఆచార్, ప్రహ్లాద్ ఆచార్ వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఆలయ ఆవరణలో పల్లకోత్సవం చేపట్టారు.

క్రీడాకారిణిలపై లాఠీచార్జీ దారుణం

ఎమ్మిగనూరుటౌన్: లైంగిక వేధింపులపై నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లింగ్ క్రీడాకారిణిలపై ఢిల్లీలో లాఠీ చార్జీ చేయడం దారుణమని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రీడాకారిణిలను లైంగికంగా వేధించిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా స్వీకరించి బాధితులకు న్యాయం చేసి నిందితులను శిక్షించాలని కోరారు.నాగవేణి, ఉరుకుందమ్మ,లక్ష్మి,మాధవి పాల్గొన్నారు.

పదిలో పెరిగిన ఉత్తీర్ణత శాతం



వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పత్తికొండ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాల

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో పదిలో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది 55.65 శాతం ఉత్తీర్ణులు కాగా.. ఈ ఏడాది 67.30 శాతం ఉత్తీర్ణులయ్యారు. 29 ఉన్నత పాఠశాలలకు చెందిన 2,223 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 1,496 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఇందులో మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 364 మంది విద్యార్థుల్లో 258 మంది పాసవగా, 70.88 శాతం ఉత్తీర్ణత నమోదైంది. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 62 మందికి గాను 25 మంది ఉత్తీర్ణులు కాగా 40.32 ఉత్తీర్ణత శాతం నమోదైంది. వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో 153 మందికి వంద మంది పాసై 54.95 శాతం, ఎస్ఎంఎస్ జెడ్పీహెచ్ఎస్ 131 మందిలో 76 మంది ఉత్తీర్ణులై 50.33 శాతం, జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 83 మందికి గాను 30 మంది పాసై 36.14శాతం, ఉర్దూ హైస్కూల్‌లో 58 మందికి గాను 35 మంది పాస్ కాగా 60.34 శాతం, ఎంఎస్ నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో 88 మందిలో 51మంది పాస్ కాగా 57.95 శాతం, కేజీబీవీలో 26 మంది పరీక్షలు రాయగా 23 మంది పాస్ కావడంతో 88.46 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

గోనెగండ్ల: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారు. శనివారం వెల్లడించిన ఫలితాల్లో 46 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 8 పాఠశాలల్లో 575 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా 205 మంది పాసయ్యారు. గతేడాది 30 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులు కాగా..ఈ ఏడాది 46 శాతం ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు.

చిప్పగిరి: పది ఫలితాల్లో బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. మండలంలో మొత్తం 275 మంది (బాలికలు 149 మంది, బాలురు 126 మంది) విద్యార్థులు పరీక్షలు రాయగా బాలికలు 87 మంది పాస్ అయ్యి 58.30 శాతం ఉత్తీర్ణత సాధించగా 55 మంది బాలురు పాసై 43.60 శాతం సాధించారు. మొత్తం ఉత్తీర్ణతా శాతం 51.6 శాతంగా నమోదైంది. కేజీబీవీ పాఠశాలలో 39 మంది పరీక్ష రాయగా 27 మంది పాసై 69.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. .

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్, ఎర్రకోట, కోటేకల్, దైవందిన్నె, కదివెళ్ల, కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్స్ ఉన్నాయి. గుడేకల్‌లో 124 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 54 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎర్రకోట జెడ్పీ స్కూల్‌లో 80 మందికి గాను 28 మంది ఉత్తీర్ణత సాధించారు. కోటేకల్‌లో 48 మందికి గాను 34 మంది, దైవందిన్నె స్కూల్‌లో 132 మందికి 58 మంది, కడివెళ్లలో 45 మందికి గాను 21 మంది, కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో 58 మందికి గాను 47 మంది ఉత్తీర్ణత సాధించారు.

మద్దికెర : మండలంలో పది ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. 414 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 270 మంది పాసై 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. బాలికలు 212 మందికి గాను 147 మంది పాసవగా, బాలురు 202 మందికి గాను 123 మంది ఉత్తీర్ణులయ్యారు.

నందవరం : ఆయా పాఠశాలల్లో 522 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 199 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో మండలంలో 36.46 ఉత్తీర్ణత శాతం నమోదైందని ఎంఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముగతిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 80 మంది పరీక్షలు రాయగా 55 మంది ఉత్తీర్ణులై 68.75 శాతం ఉత్తీర్ణీత సాధించారని, నందవరం జెడ్పీ పాఠశాలలో 159 మందికి గాను 61 మంది ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బా పాఠశాలలో 37 మందిలో 13 మంది ఉత్తీర్ణత సాధించారు. కనకవీడు ఉన్నత పాఠశాలలో 49 మంది పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణులయ్యారు. నాగలదిన్నె ఉన్నత పాఠశాలలో 113 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది ఉత్తీర్ణులయ్యారు. ముగతి జెడ్పీ పాఠశాలలో 40 మందిలో 17 మంది పాసయ్యారు. ఇబ్రహీంపురం జెడ్పీ పాఠశాలలో ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు.

పత్తికొండ రూరల్ : మండలంలో 987 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 552 మంది పాసై 55.93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. బాలుర గురుకులం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడుగురు 550పైన మార్కులు సాధించారు.మరో 32 మంది 500 పైగా మార్కులు సాధించారు.

తుగ్గలి : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత తగ్గి పోయింది. మండలంలో పది స్కూళ్లలో 567 మందికి గాను 221 (38.98) మంది ఉత్తీర్ణత సాధించారు. తుగ్గలి జెడ్పీహెచ్ఎస్‌లో 53 మందికి 14 మంది ఉత్తీర్ణులు (26.42శాతం), జొన్నగిరిలో 135 మందికి 81 మంది (60శాతం), పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో 147కుగాను 29 మంది (19.73శాతం), రామ లింగాయపల్లిలో 35 మందికి 5మంది(14.29శాతం), కేజీబీవీలో 35మందికి 15మంది (42.86శాతం), పగిడిరాయిలో 49మందికి 36 మంది (73.47శాతం), ఎద్దులదొడ్డి 14 మందికి ఇద్దరు(14.29శాతం), రాతన ఆశ్రమ స్కూల్ 21 మందికి 13 మంది (61.90శాతం), రాతన జెడ్పీ 27 మందికి నలుగురు(14.81శాతం), ఏపీటీడబ్ల్యూఆర్ 30 మందికి ముగ్గురు (10శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో రామవెంకటేశ్వర్లు తెలిపారు.

హొళగుంద: మండలంలో పది ఫలితాల్లో 51.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. హొళగుంద, హెబ్బటం, ఇంగళదహాళ్, గజ్జహళ్లి, సుళువాయి, ఎల్లార్తి, హొళగుంద కేజీబీవీకి చెందిన మొత్తం 599 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 311 మంది ఉత్తీర్ణులైయ్యారు. సుళువాయి హైస్కూల్ అత్యధికంగా 88.10 శాతం ఉత్తీర్ణత సాధించగా, హొళగుంద కస్తూర్బా 25.99 శాతం ఉత్తీర్ణతను సాధించింది.

వెల్దుర్తి: పదో తరగతి ఫలితాలలో మండల వ్యాప్తంగా 14 ప్రభుత్వ, 2 ప్రైవేట్ పాఠశాలల్లో 54.50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. ఇది గతం కంటే 13.50 శాతం ఎక్కువని చెప్పారు. మొత్తం 822 మంది పరీక్షలు రాయగా 448 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బాలురలో 310 మందికి గాను 128 మంది (41.29శాతం) పాసయ్యారు. బాలికల్లో512 మందికి 320 మంది (62.50శాతం) పాసయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 81.33శాతం ఉత్తీర్ణతతో జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం మొదటి స్థానంలో నిలిచింది. 77.50 శాతం ఉత్తీర్ణతతో అంబేడ్కర్ ఎస్సీ గురుకులం రెండో స్థానం, 62.16శాతం ఉత్తీర్ణతతో కేజీబీవీ మూడో స్థానంలో నిలిచాయి. బీసీ బాలికల హాస్టల్‌లో 74శాతం, ఎస్సీ బాలుర హాస్టల్‌లో 62.5 శాతం పాసయ్యారు.

కృష్ణగిరి: మండల వ్యాప్తంగా 551మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 439 మంది పాసై 79.67 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ 92.39 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. మిగిలిన 9 పాఠశాలల్లో తర్వాతి స్థానాల్లో కృష్ణగిరి హైస్కూల్ 91.66 శాతం, పోతుగల్లు హైస్కూల్ 89.28శాతం, కేజీబీవీ 87.8శాతం, కంబాలపాడు ఎస్సీ గురుకులం 86.84 శాతం, అమకతాడు జెడ్పీ హైస్కూల్ 84.21శాతం, కటారు కొండ హైస్కూల్ 75.47శాతం, కోయిలకొండ హైస్కూల్ 71.66శాతం, కంబాలపాడు హైస్కూల్ 69.2శాతం, ఎరుకలచెరువు హైస్కూల్ 67.86 ఉత్తీర్ణత సాధించారన్నారు.

భజన పోటీల విజేత పుల్లగుమ్మి

వెల్దుర్తి: మండలంలోని బోయనపల్లెలో రాధాస్వామి, ఆదోని లక్ష్మమ్మ అవ్వల ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన భజన పోటీల్లో మండలంలోని పుల్లగుమ్మి గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర స్వామి భజన బృందం విజేతగా నిలిచి రూ.10,016 నగదు బహుమతి గెలుచుకుంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జరిగిన ఆధ్యాత్మిక భజన హోరాహోరీగా సాగింది. ద్వితీయ స్థానంలో ఆలంకొండ అన్నపూర్ణ శ్వేశ్వర భజన బృందం, తృతీయ స్థానంలో చిన్నటేకూరు వీరాంజనేయ భజన బృందం నిలిచి వరుసగా రూ.8,016, రూ.6,016 గెలుచుకున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో శనివారం బోర్లు వేయించారు. ఎంపీటీసీ యాసీన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పులికొండ, మోహన్ రెడ్డి, శీను ఆధ్వర్యంలో కులుమాల రోడ్డులో మూడు, గోనెగండ్ల రోడ్డులో ఒకటి బోర్లు వేయించారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: ఈనెల 3న శ్రీరంగాపురం గ్రామ రైతు మాధవస్వామి దానిమ్మ తోటను, డ్రిప్, మోటార్ పైప్‌లైన్లను ధ్వంసం చేసిన దుండగులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్ కోరారు. శనివారం ఆయన బాధిత రైతు తోటను పరిశీలించారు. పంట కోతకు వచ్చిన సమయంలో వంద దానిమ్మ చెట్లు, పంట, సామగ్రి ధ్వంసంతో రైతుకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మోటారు, డ్రిప్ పరికరాల చోరీ

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామ పొలిమేరలో బావి వద్దనున్న తన బోరు మోటారు, కరెంటు వైరు, డ్రిప్ పరికరాలు గుర్తుతెలియని దుండగులు గత నెల 26న చోరీ చేశారని రైతు శానగిరి పెద్దబీసన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బాధిత రైతు పలు చోట్ల విచారించినా ఆచూకీ లభించక తమను సంప్రదించాడన్నారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కృష్ణగిరి: మండల ఆగవేలి పొలిమేరలోనున్న పొలం తగాదాలో పి.కోటకొండకు చెందిన ఇరువర్గాలపై శనివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తన పక్క పొలంలో నీరు నిలిచి ఉండగా తానే నీళ్లు వదిలినట్లు అపవాదు వేసి తనపై బాషా, హుసేన్, హనీఫ్ దాడి చేసి గాయపరిచాడని రామచంద్రుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే..రామచంద్రుడు, చెన్నకేశవులు తమ పొలం వైపు గట్టు తెంపి నీళ్లు వదిలారని, ప్రశ్నించగా తమపై దాడి చేశారని హుసేన్ ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాల వారిపై కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేలకొరిగిన వరి



పెద్దగోనెహాళ్ వద్ద ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పైరు

హొళగుంద: మండలంలోని పెద్దగోనెహాళ్, హొళగుంద, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాల్లో ఈదురు గాలులకు వరి పంట నేలకొరిగింది. అకాల వర్షానికి పైరు నెలకొరిగి గింజలు నేల పాలయ్యాయని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేసిన వరి పంట ఇప్పటికే 80 శాతం కోతలు పూర్తయ్యాయి. అయితే ఆలస్యంగా సాగు చేసిన వారి పంట నేలవాలింది.

ఉత్తమ దర్శకుడిగా భాను భవ తారక్



అవార్డు అందుకుంటున్న భాను భవతారక్

ఎమ్మిగనూరు టౌన్: 13వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిమ్ ఫెస్టివల్‌లో భాగంగా ప్లాట్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా పట్టణానికి చెందిన యుఎం నటరాజ్ కుమారుడైన యుఎం భాను భవ తారక్ ఎంపికయ్యారు.గతనెల 30న ఢిల్లీలోని నోయిడాలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో రియల్ ఎస్టేట్ రంగంపై తాను దర్శకత్వం వహించిన ప్లాట్ చిత్రానికి ఈ అవార్డు వచ్చినట్లు ఆయన శనివారం విలేకరులకు తెలిపారు.

ఆరోపణలు అర్థ రహితం



మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వారసత్వంగా వచ్చిన ఆస్తి తమ తండ్రి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి వందలాది ఎకరాల్లో ఉందని, తమ కుటుంబానికి భూ ఆక్రమణలు చేయాల్సిన అవసరం లేదని, మాజీ ఎమ్మెల్యే బీవీ ఆరోపణలు అర్థరహితమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేశన్న, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గ్రామంలోనున్న శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి తాము వంశపారంపర్య ధర్మకర్తలన్నారు. అయితే ఆలయ భూములు గ్రామానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన వారు కౌలుకు చేస్తున్నారన్నారు. వచ్చిన శిస్తుతో పాటు తాము సొంతంగా కొంత డబ్బు వెచ్చించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఈ విషయం గ్రామస్తులందరికీ తెలుసన్నారు.అయితే ఆలయానికి ఆదాయం తక్కువగా వస్తుండటంతో ఎండోమెంట్ శాఖ పరిధిలో లేదన్నారు. తాము కడిమెట్లలో భూములు ఆక్రమించుకున్నామని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని, లేకపోతే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా అంటూ సవాల్ విసిరారు. పాదయాత్ర కొచ్చిన నారాలోకేష్ అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెప్పకపోగా.. తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్ బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, వైస్ ఎంపీపీ పోలయ్య, బాస్కర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేడుకగా దేవర



జన సందోహం మధ్య సాగుతున్న పల్లకోత్సవం

నందవరం : 72 గ్రామాల నుంచి తరలివచ్చిన భక్త జన కోలాహలం.. డోలు వాయిద్యాలు, వేణు గానాల నడుమ.. గొవరయ్యల ప్రదర్శనల మధ్య భీరలింగేశ్వరుడి పెద్ద దేవర ఘనంగా సాగాయి. అశేష భక్తజన సందోహం మధ్య పల్లకోత్సవాలు కనువిందు చేశాయి. మండల కేంద్రంలో 25 ఏళ్ల తర్వాత పెద్ద దేవర శనివారం నిర్వహించారు. బీరప్ప ఆలయ కట్ట పరిధిలోని 72 ఊళ్ల నుంచి భక్తులు పాల్గొన్నారు. ముందుగా బీరప్ప ఆలయంలో పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేపట్టారు. శుక్రవారం నందవరం భీరలింగేశ్వరస్వామి, హెచ్.మురవణి చౌడేశ్వరి దేవి, చిన్నహేట బీరప్ప, సూగూరు వీరనాగప్ప, కె.తిమ్మాపురం బీరప్ప పల్లకీలతో తుంగభద్ర నదికి యాత్రగా బయలుదేరారు. శనివారం ఉదయం వారు స్థానిక చౌడేశ్వరి ఆలయం చేరుకుని పల్లకీలతో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం దేవ పటాల కార్యక్రమం నిర్వహించనున్నారు. సర్పంచు తోట సావిత్రి, ఉప సర్పంచు శివారెడ్డిగౌడ, సీఐ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, ఆలయ కమిటీ బృందం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సద్గురు అల్లీపీరాసాహెబ్ ఉరుసు



ప్రార్థనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రవచనాలు ఆలకిస్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా సాహెబ్ స్వామి ఉరుసు శనివారం ఘనంగా జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు స్వామి ప్రవచనాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం పీఠాధిపతి దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు హాజిహుసేన్ సాహెబ్ పీరా స్వామి ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల ఉపాధ్యక్షుడు పోలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాజశేఖర్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు షబ్బీర్, భాస్కర్ ఉన్నారు.


తాగు, సాగు నీరు అందించాలి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మండలానికి తాగు, సాగునీరు అందించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక, కేవీపీఎస్, ఏపీ ఎమ్మార్పీఎస్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, రైతు కూలీ సంఘం నాయకులు పాణి, బజారప్ప, నాగన్న, ఎస్ఎన్ మాబువలి, జయమ్మ కోరారు. శనివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ దినేష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎల్లెల్సీ కాలువ పక్కనే పారుతున్నా మండలాన్ని తాగునీటి సమస్య వేధిస్తుందన్నారు. హంద్రీ పరీవాహక గ్రామాలైన ఎనకండ్ల, గంజిహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాలకు ఫ్లోరైడ్ నీరే దిక్కయ్యిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎల్లెల్సీ ఆయకట్టును స్థిరీకరించి, జీడీపీ నుంచి ఎగువ ప్రాంతాలకు ఎత్తిపోతుల పథకం ద్వారా తాగు, సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి వీవోఏలకు శిక్షణ

తుగ్గలి : స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం నుంచి వీవోఏలకు లోకోస్ యాప్‌పై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాధాకృష్ణ శరివాకం తెలిపారు. పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వీవోఏలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి



హెబ్బటంలో విచారణ చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హొళగుంద: గ్రామ సచివాలయాల్లో సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శనివారం సుళువాయి, బీజీ హళ్లి, హొళగుంద, వందవాగిలి, హెబ్బటం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వన్ టైమ్ సెటిల్‌మెంట్‌తో రైతులు తమ పొలాలను నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తులకు సంబంధించి ఆయా గ్రామాలను సందర్శించారు. దరఖాస్తులో పొందు పరిచిన రికార్డుల మేరకు పొలాలను పరిశీలించి తహసీల్దారు హుసేన్ సాహెబ్‌కు సలహాలు, సూచనలిచ్చారు. హెబ్బటం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది పని తీరు తదితర వాటి గురించి ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం పై సిబ్బందిని మందలించారు. ఆర్ఐ దినోజ్, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్ఓలు ఉన్నారు.

మచ్చలేని నాయకుడిపై ఆరోపణలా?



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల: అవినీతి దూరంగా ఉండే, మచ్చలేని నాయకుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డిపై ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి తగదని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్ విండో అధ్యక్షుడు కాశిరెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ బందెనవాజ్, కన్వీనర్ దొరబాబు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలు అవి నీతి ఆరోపణల్లో కురుకుపోయిన మాజీ ఎమ్మెల్యే బీవీకి లోకమంతా అదేరకంగా కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ధైర్యముంటే ఆరోపణలు నిరూపించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాణలు చెప్పా లని సవాల్ విసిరారు. బురదజల్లే రాజకీయాలు చేయడంలో మీ పార్టీని మించిన వారు దేశంలోనే లేరని, అలాంటిది మీరు కూడా ఆ పార్టీ విధానాలను బాగా వంటబట్టించుకున్నందునే పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇటీవల యువగళం పేరుతో నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో హైకమాండ్ నుంచి మొట్టికాయలు పడటంతో ఏమి చేయాలో దిక్కుతోచక విమర్శలు, ఆరోపణలకు తెర తీశారని, తీరు మార్చుకోకపోతే ఈసారి రాజకీయాల్లోనే లేకుండా ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయ మన్నారు. పాదయాత్ర కోసం కార్యకర్తల నుంచి రూ.వెయ్యి చొప్పున సేకరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.నాయకులు మురళి నాయుడు, గోవింద్, నాయుడు, డాక్టర్ శివరాం, మునెప్ప, బజారి, మాబువలి, పద్మనాభం, కొలుట్లయ్య స్వామి, పెయింటర్ రహిమాన్, పులికొండ, ఓబులయ్య స్వామి, గంగాధర్, మత్స్యవల్లబుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితమని , కాన్పులు ఆసుప్రతుల్లో జరిగేలా చూడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా కాన్పులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచలింగాలలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని కలుగొట్ల - ఎస్. నాగలాపురం గ్రామాల మధ్య శనివారం సాయంత్రం 230 బస్తాల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐచర్ లారీలో గ్రామాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుబడిన బియ్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రూరల్ పోలీసులు మాట్లాడుతూ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని, కేసు విచారణ చేస్తున్నామని చెప్పారు.

6 వేల ఎకరాల్లో తోటల సాగుకు ప్రణాళిక



ఎరుకలచెర్వు గ్రామ సమీపంలో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథరెడ్డి

కృష్ణగిరి: ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 6 వేల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డ్వామా పీడీ అమర్నాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం, ఎరుకలచెర్వు గ్రామాల్లో జరుగుతున్న మళ్లింపు కాల్వ పనులను, అవెన్యూ ప్లాంటేషన్, పండ్ల తోటలను శనివారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు లక్ష 20 వేల మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. కొన్ని రోజులుగా వర్షాలు పడటంతో కొంత మేర కూలీలు తగ్గారని, రోజుకు 1. 57లక్షల మందికి పనులు కల్పించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కృష్ణగిరి మండలంలో 400 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు అవకాశం కల్పించాలని, ఐదు ఎకరాల్లోపు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, ఈసీ శేషిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ హుసేన్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుభాష్, పరుశరాముడు, కుమార్ ఉన్నారు.